క్లుప్తంగా

టీచ్ టూల్ శిక్షణ ఉపయోగకరం



టీచ్ టూల్ శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ

నగరి: టీచ్ టూల్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని డీఈఓ దేవరాజులు అన్నారు. గురువారం నగరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి టీచ్ టూల్ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీదేవి, నమఃశ్శివాయం, ఏఎంఓ పల్లవి, టీచ్ టూల్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ప్రేమ్, విషయ నిపుణులు నాదముని, ఈశ్వరయ్య, కోదండయ్య, శరవణ, వసంత పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాని గంగమ్మ ఆలయ హుండీలోని కానుకలను గురువారం ఈఓ తిమ్మరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఈఓ మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి 2024 మార్చి నెల నుంచి ప్రస్తుతం వరకు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.2లక్షల 24,808 నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ ఆదాయాన్ని బ్యాంక్‌లో జమచేశామన్నారు. ఆలయ చైర్మన్ లింగారెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నింద్ర: స్థానిక బస్టాండ్ సమీపంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పుత్తూరు పరమేశ్వరమంగళంలోని అన్న గౌరి వైద్యశాల వారి ఆధర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి పరీక్షలు, షుగర్, బీపీ, దంత సమస్యలు, చర్మ వ్యాధులకు సంబంధించి రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గౌరి

శ్రీరంగరాజపురం: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ గౌరి అన్నారు. ఆరిమాకులపల్లి గంగమ్మ గుడి వద్ద డ్వాక్రా మహిళలతో మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆరోగ్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యమున, వెలుగు సీసీ లావణ్య పాల్గొన్నారు.

డిఫాల్ట్ గ్రూపుల బలోపేతానికి కృషి



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

పాలసముద్రం: మండలం పరిధిలోని డిఫాల్ట్ గ్రూపులను బలోపేతం చేయడానికి ఐకేపీ సిబ్బంది కృషిచేయాలని ఐకేపీ ఏపీఎం ఫరిదు మస్తాన్ తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్ర, వీఓ లీడర్లకు ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం సామాజిక సమీకరణలో భాగంగా మండల మహిళా సమాఖ్య పరిధిలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఫాల్ట్ గ్రూపులను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషిచేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకుని జీవనోపాధి పెంచు కోవాలన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అడ్డుకట్టేదీ?

- నూతన పాలసీ రాకముందే తరలింపు
- ఇసుక రీచ్‌లు లేవంటూ ఇటీవలే ప్రకటించిన జాయింట్ కలెక్టర్
- అయినా ఆగని అక్రమ రవాణా




కుశస్థలి నదిలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

నగరి: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుక సరఫరాపై కొత్త పాలసీ ప్రవేశపెడతామంటూ ప్రకటించింది. ఆ పాలసీ ప్రవేశపెట్టకముందే అధికారమే లైసెన్స్‌లా ఇసుక తరలింపు ముమ్మరంగా జరుగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మండలంలోని తెరణి పంచాయతీలో కుశస్థలి నదిలోని ఇసుకను తరలించేస్తున్నారు. ఇప్పటికే బుగ్గఅగ్రహారం నుంచి సత్రవాడ వరకు వాల్టా చట్టాన్ని కూడా లెక్కచేయక ఇసుక తరలించేయడంతో ఆ ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తప్ప ఇసుక జాడ కనిపించడం లేదు. తెరణి పంచాయతీలో పరిమితికి మించి తరలించేశారు. అయినా ఇసుకాసురులు వెనకడుగు వేయడం లేదు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు మే 20న మండలంలోని ఓజీ కుప్పం ఇసుక రీచ్‌ను భూగర్భగనులశాఖ జిల్లా అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, షబ్, ఎక్సైజ్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, రవాణాశాఖల అధికారులతో కలసి పరిశీలించిన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు రీచ్‌కు సంబంధించి అనుమతి గడువు పూర్తయినా ఇంకా ఇసుక అక్రమరవాణా జరుగుతుంటే వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీ, సంబంధిత శాఖ అధికారులు ఏమిచేస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టవలసిన బాధ్యత మీకు లేదా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రీచ్ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని దండోరా వేయించాలని పంచాయతీ సెక్రటరీని, తహసీల్దార్‌ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 14 ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చామని, ఆ ఇసుక రీచ్‌ల గడువు పూర్తి అయిందని వెల్లడించారు. నగరి మండలంలో వాగులు, వంకల్లో ఇసుక అక్రమ రవాణా జరగకూడదన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసి వెళ్లారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలను ఇసుక తరలింపుదారులు పెడచెవిన పెట్టారు. అధికారుల కన్నుగప్పి యథేచ్ఛగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలించేస్తున్నారు. ఇసుక తరలింపునకు అడ్డుకట్టవేయాలని తెరణి పంచాయతీకి చెందిన ప్రజలు కోరుతున్నారు.



ఇసుక రీచ్‌లు లేవని చెబుతున్న జేసీ (ఫైల్)



సినీనటి వరలక్ష్మీ శరత్‌కుమార్‌కు మాజీ మంత్రి ఆర్కే రోజా ఆశీస్సులు అందజేశారు. చెన్నైలో బుధవారం రాత్రి జరిగిన ఆమె వివాహ రిసెప్షన్‌కు భర్త ఆర్కే సెల్వమణితో వెళ్లిన రోజా నూతన జంటకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. -నగరి


విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలి



పుత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నేతలు

పుత్తూరు: నీట్, నెట్ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా తీవ్రంగా నష్టపోయిన విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి, అనంతరం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరిట దేశ వ్యాప్తంగా పాఠశాలల మూసివేత కార్యక్రమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే అన్ని విద్యార్థి సంఘాలతో కలసి చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు వెంకటేష్, మహేష్, విద్యార్థి సంఘ నేతలు దినేష్, విక్రమ్, దిలీప్, ఉదయ్, కరుణాకరన్, అభి, వర్మ, అభిషేక్, పాల్గొన్నారు.

సాయి దివ్యధామంలో మహాపాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

నగరి: పట్టణ పరిధి రాజీవ్‌నగర్ గుట్టపై ఉన్న సాయి దివ్యధామంలో గురువారం మహాపాలాభిషేక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురుపూర్ణిమకు ముందు ఆలయంలో ప్రతి ఏడాది ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం ఓంకారం కాగడ హారతిచే బాబా మేల్కొలుపు సేవ చేశారు. పట్టువస్త్రాలతోను, రుద్రాక్ష, చందన, ముత్యపు దండలతోను, వెండి కిరీటంతోను అలంకరించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని సాయినాథుని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ షిరిడీ సాయిబాబా ఉత్సవ విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. పాలాభిషేకం అనంతరం సాయి వ్రతం నిర్వహించారు.

చచ్చినా చావే!

- అంత్యక్రియలకు నానా అగచాట్లు
- వైకుంఠ రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లలేక అవస్థలు
- చివరకు చెత్త తరలించే ట్రాక్టర్‌లో మృతదేహం తరలింపు



చెత్త తరలించే ట్రాక్టర్‌లోకి మృతదేహం తీసుకెళుతూ..

గంగాధర నెల్లూరు: నియోజకవర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరు వాసులు ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు చేసేందుకు చావు కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. అంత్యక్రియలు నిర్వహించే ప్రాంతానికి వెళ్లే మార్గం అంతా చెత్తాచెదారాలు, చికెన్ వ్యర్థాలతో దుర్గంధం చిమ్ముతుండడం, వీటి మూలాన దారి కుదించుకుపోయి మృతదేహాలను తరలించలేక నానా అగచాట్లు పడుతున్నారు. వివరాలు..కూతవేటు దూరంలో ఉన్న నీవానది ప్రాంతాన్ని ఎన్నో ఏళ్లుగా అంత్యక్రియలకు వినియోగిస్తున్నారు. తొలినాళ్లలో ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతం కాలక్రమంలో డంపింగ్ యార్డుగా తయారైంది. చికెన్ వ్యర్థాలు, చెత్తాచెదారం పడేస్తుండడం ఆ ప్రాంతం అంతా దుర్గంధభరితంగా మారింది. చికెన్ వ్యర్థాలను వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గతంలోనే పలు పర్యాయాలు అధికారులను కోరినా పట్టించుకున్న పాపానపోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో గంగాధరనెల్లూరులో మరణించిన ఒక వ్యక్తికి అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని తరలించేందుకు గురువారం ఆ ప్రాంతంలో నానా బాధలు పడ్డారు. వైకుంఠరథం (టాటా ఏస్ వ్యాన్)లో మృతదేహాన్ని తరలిస్తూ నీవానది ప్రాంతంలో వ్యర్థాలు, చెత్తకుప్పల మూలాన వాహనం వెళ్లలేని పరిస్థితి కలిగింది. విధిలేక అక్కడ చెత్త తరలించే వాహనంలోకి మృతదేహాన్ని మార్చి అంత్యక్రియల ప్రదేశానికి తీసుకెళ్లారు. ఎంతో గౌరవప్రదంగా సాగాల్సిన కడసారి అంతిమ వీడ్కోలు ఇలా బాధాకరంగా చేయాల్సి రావడం తమను మరింత ఆవేదనకు గురిచేసిందని మృతుడి కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి గంగాధర నెల్లూరుకు ప్రత్యేకమైన శ్మశాన స్థలాన్ని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



నీవానదిలో పడేసిన చికెన్ వ్యర్థాలు



దారి లేక చికెన్ వ్యర్థాల నడుమ ఆగిన వైకుంఠరథం

దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం: మండలంలోని మాధవరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో రెండవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ లలిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ లేదా ఈనెల 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తును నేరుగా కళాశాలలో సమర్పించి వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8639790174, 6303156450, 9494434236, 9177035120 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

పాలసముద్రం: మండలంలోని రైతన్నలు వరి, వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం సీఎం కండ్రిగ గ్రామంలో రైతులకు వేరుశనగ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని సూచించారు. నేల సారవంతంగా ఉంటే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యాజమాన్యాలను వివరించారు. అనంతరం సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమష్టి కృషి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

కార్వేటినగరం: పంచాయతీ అభివృద్ధికి అధికారులు, వార్డు మెంబర్లు సమష్టిగా కృషిచేయాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈఓ పీఎస్ మణి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ కార్వేటినగరంలో ఇప్పటికే 90 శాతం అభివృద్ధి పనులు చేశామన్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు వార్డు మెంబర్లు గుర్తించి పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఎస్ మణి, మండల వ్యవసాయ అధికారిణి హేమలత, మండల పశువైద్యాధికారి హేమకుమార్, ఎంఈఓ విజయకుమార్, ఏపీఓ జాహ్నవి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది



అమరావతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా

– మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కేరోజా భరోసా ఇచ్చారు. పట్టణ పరిధిలోని మిట్టపల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు ఆర్.మోహన్‌రెడ్డి, అన్నురెడ్డిల తల్లి అమరావతమ్మ ఇటీవల మృతిచెందారు. గురువారం ఆర్కే రోజా గ్రామానికి వెళ్లి అమరావతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, నేతలు రవీంద్ర, దిలీప్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న కమిషనర్

నగరి: పందుల పెంపకందారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం పందుల పెంపక యజమానులను మున్సిపల్ కార్యాలయం వద్దకు రప్పించిన ఆయన నిర్లక్ష్యం కారణంగా పందులు రోడ్లపై, వీధుల్లో సంచరిస్తుండడంతో పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వార్డుల్లో పందుల సంచారం ఎక్కువగా ఉందని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వెంటనే పందులను దూర ప్రాంతాలకు తరలించాలని వారికి తెలియజేశారు. వారం రోజుల పాటు గడువు ఇస్తున్నామని ఆపై పందులు పట్టణ పరిధిలో సంచరిస్తే యజమానుల ప్రమేయం లేకుండా మున్సిపల్ సిబ్బంది వాటిని పట్టి దూరప్రాంతాల్లో వదిలేస్తారని హెచ్చరించారు. అందుకు జరిగే ఆర్థిక నష్టానికి పురపాలక సంఘం వారు బాధ్యులు కారని స్పష్టం చేశారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించండి



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రఘు, అధ్యాపకులు

పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే మీ పిల్లలను చేర్పించాలని బలిజకండ్రిగ ఇన్‌చార్జ్ హెచ్ఎం రఘు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. గురువారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బలిజకండ్రిగలో బాలికల జూనియర్ కళాశాల ప్రారంభించి రెండేళ్లు అయిందన్నారు. అధ్యాపకుల కొరత ఉన్నా పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇప్పుడు అధ్యాపకుల కొరత లేదని, మీ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని అన్నారు. అనంతరం ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పుత్తూరు: మండల పరిధిలోని వేపగుంట క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు గురువారం సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుత్తూరు మండలంలో ఎస్ఈబీ సీఐ వై.ఉరుకుందమ్మ ఎస్ఐ ఎ.వి.రమణ రాజులు సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీట్ రద్దుకు ఆందోళన



మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘాలు

- నగరిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం
- ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌కుమార్

నగరి: నీట్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా నగరిలో విద్యాసంస్థలు బంద్‌ను పాటించాయి. ఇందులో భాగంగా విద్యార్థి సంఘాలు కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నీట్ (యూజీ), నీట్ (పీజీ) యూజీసీ నెట్ పేపర్ లీకేజీ బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. పేద, మధ్య, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేటువంటి పద్ధతుల్లో పేపర్ లీకేజీ వ్యవహారం నడుస్తోందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నీట్ పరీక్షతోపాటు ఎన్టీఏను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీలో తెరవెనుక జరిగిన స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు కోదండయ్య, బాషా, సత్తార్, శేఖర్, సిరాజ్‌వుద్దీన్ సంఘీభావం తెలుపగా ఏఐఎస్ఎఫ్ నేతలు రాబిన్, రోహిత్, విశాల్, ముని పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళి



విజయపురం: అల్లూరి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



కార్వేటినగరం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

విజయపురం: బ్రిటీష్ పాలకుల కబంధహస్తాల నుంచి అమాయక గిరిజన ప్రజల విముక్తి కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌స్వామి అన్నారు. గురువారం మండలం కేంద్రంలో అల్లూరి సీతారామరాజు 127 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా కుమార్‌స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. నేతలు గుణశేఖర్‌రెడ్డి, నార్పరాజు, శివరాజు, ప్రతాప్‌రాజు, భాస్కర్‌రాజు, పాండియన్ పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు ఎంతో ఆదర్శమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. గురువారం అల్లూరు సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి అల్లూరి జీవిత చరిత్రను డిజిటల్ రూపంలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ బాబు, సరిత, కార్తీక్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.